## అతిధి

అసలే కరువుకాలం. అందులో గడ్డు రోజులు. ఇంటికివచ్చిన అతిథి సుబ్బావధానులు పెరటిలో స్నానంచేస్తున్నాడు. సోమిదేవమ్మకు వెంకటావధానులకు అతిథిసత్కార విషమసమస్యను ఎదుర్కొవలసివచ్చిన పరీక్షా సమయము వచ్చింది. అందుమీదట 3 నిముషములు వంటింట్లో రహస్యసమావేశం తీవ్రసంప్రతింపులు జరిగినవి. కొద్దిసేపటిలో ఇల్లంతాసోమిదేవమ్మ"లబోలబో!" అన్న యేడుపుతో, పరివృతమైనది. అవధానుల సింహగర్జనలతో యిల్లు మారుమ్రోగుచున్నది. ఈ కోలాహలమంతా వచ్చిన అతిథి సుబ్బావధానులు చూసి, తన గుడ్డాగుడుసుతో నిష్క్రమించాడు. తదుపరిగోలఅంతా 'నిప్పులో నీళ్ళుపోసినట్లు' చప్పున చల్లారి వూరుకొంది. వెంకటావధానులు చిరునవ్వుతో "ఇక వొదిలింది పీడ! నేను కొట్టినట్లు నటించి కొడితే యెంత బాగా అభినయం చేశావు! అంతే చాలు నీ తఢాకా! ఇక వడ్డించు భోజనంచేద్దాం!' అన్నాడు. "అలాగా! నేను కూడా మోసంతెలుసుకొని యేడిచినట్లు యేడిచాను కనకే ఆపీడ వదలింది' అంది సోమిదేవమ్మ. విజయగర్వముతో ఇంతలోకి తలుపు వారను దాగివున్న సుబ్బావధానులు హంసగమనంతో మందహాసం చేయుచూ వచ్చి, "మీరు కొట్టినట్లే కొట్టేరు' అమ్మగారు యేడిచినట్లే యేడిచారు! నేనుకూడా వెళ్ళినట్లే వెళ్ళి తిరిగి వచ్చాను. ఇవాళ మరి మీకు తప్పను ఎన్నన్నాసరే!" అంటూ ఆపూట అవధానులుగారి సహపంక్తిని ఇష్టకృతుగా భోజనంచేసి, దంపతులను ఆశీర్వదించి నిజేచ్ఛన్ జనియె!

ఫణిహారం వెంకటరెడ్డాచార్యులు.

* * *

## టోపీదాస్

'పజిల్ గెలవండి! 30000 రూ॥ పజిల్ కష్టపడకుండా గెలవండి! తరుణము తప్పితే ఆశాభంగం! ప్రవేశరుసుము ఒక రూపాయి మాత్రమే!' అనే ఎడ్వర్టైజ్‌మెంట్ ఒక ఆదివారపు 'పత్రిక' లో ఒక కాంపిటేషన్ కంపెనీ మేనేజర్ చేయడం కన్పించింది. దానితో ఎక్కడలేని ఉత్సాహం నాలో రేకెత్తింది. నేను నిశ్చయించుకున్నాను, 'ఒక్క రూపాయితో మొదటి బహుమానం 15000 రూ॥ వస్తున్నాయి. ఇంత అదృష్టం మనకీ జన్మలో కలుగదు' అని హుషార్ పుట్టించుకున్నా.

ఎలాగైతేనేం సంపాదించాను పజిల్ పంపడానికి కావలసిన ధనం. జాగ్రత్తగా క్రాసోవర్డ్ పజిల్ నింపి కవరులో పెట్టి సర్వాలంకారాలతో స్వయంగా పోస్టుచేశాను. ఆపజిల్ ఫలితాలు 15 వ తేదీ 'పత్రిక'లో ప్రచురింపబడతాయని ఉంది. ఎంత వేగంగా ఆ నిర్ణయింపబడిన తేదీ వస్తుందా అని కుతూహలంతో వేచియున్నా.

అమ్మయ్య!! 'పత్రిక' వచ్చింది. అందులో వుంది 'కాంపిటేషన్‌కంపెనీ దివాలా తీసింది' అని.

అబ్బ! కాంపిటేషన్ కంపెనీ మేనేజర్ ఎంతటి 'టోపీదాసు!!'

బులుసు-జీ-ప్రకాష్.

## ఉపాయం

పరీక్షలు అయినవి. మా అక్కగారింటికి వెళదామని మధ్యాహ్నం 12 గంటలకు బస్సులస్టాండుకు వెళ్ళి లగేజిని (కందులబస్తా) టాపుపైవేసి సీటు మీద కూర్చున్నా. "ఏమండోయ్ ఆ బస్తా ఏమిటి" అన్నాడు కండక్టరు. "కందులు" అన్నా. "ఎక్కడికి" బొబ్బిలి అని పలికితిని. లగేజీ చార్జి అర్ధరూపాయి అవుతుంది అన్నాడు. తగ్గించడానికిప్రయత్నించాకాని ఫలితం శూన్యం. డబ్బు ఎక్కువగా లేకపోవడంవల్ల ఇంటికి కబురుచేశాను.

ఇంతలో బస్సు బయలుదేరింది. కాని ఎవరో వస్తారని ఆపారు బస్సుని. ఇంతలో మా బ్రదర్ నాకు సొమ్మును యిచ్చి వెళ్ళేడు. బస్సు కదిలింది. ఇంతలో అవ్యక్తి ఏమండోయ్ లగేజి చార్జి యివ్వండి అన్నాడు. "ఏయ్ మావాడు ఇంకా రాలేదోయ్ బొబ్బిలి పోలీస్‌స్టేషనులో యిస్తా" అన్నాను. బెదురుతూ ఎవరు బాబూ మీరు? ఎక్కడికి వెళతారు? అన్నాడు ప్రశ్నార్థకంగా. పోలీస్‌సబ్‌యిన్స్పెక్టరు మా బావ అని ఒక కోతకోశా. ఆ వ్యక్తి కిక్కురుమనకుండా జారాడు. అసలు టిక్కెటుకూడ అడగలేదు. మెల్లిగా బస్సుస్టాండువద్ద కందుల బస్తాతో జారాను. నిజంకు మాబావ పోలీస్ సబ్‌యిన్స్పెక్టరు కానేకాడు. కాని కోతలు కోసేవానికే యీకాలంలో ప్రతిఫలం.

పంతుల వెంకట శ్రీరామమూర్తి.

